

శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వ విద్యాలయం

అడ్మిన్ ఆఫీసు , ములుగు (గ్రామం & మండలం), సిద్దిపేట్ జిల్లా –తెలంగాణ

తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి వాతావరణ ఆధారిత ఉద్యాన సలహాలు

05 -11-2026 నుండి 11-11-2026

గత మూడు రోజులుగా వాతావరణం

గత **మూడు** రోజులుగా తెలంగాణలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు సుమారు 30-35 డిగ్రీల సెల్సియస్ మరియు కనిష్ఠ ఉష్ణోగ్రతలు 18-25 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యాయి.

రానున్న ఐదు రోజుల వాతావరణ సూచన

తెలంగాణలో నవంబర్ 5 నుండి 11, 2026 వరకు వాతావరణం క్రమంగా సాధారణ స్థితికి రానుంది. వారంలోని మొదటి రెండు రోజుల్లో (నవంబర్ 5 మరియు 6) తుఫాను ప్రభావం పూర్తిగా తగ్గిపోతూ కొన్నిప్రాంతాల్లో తేలికపాటి జల్లులుకురిసే అవకాశం ఉంది, అయితే నవంబర్ 7 నుండి వాతావరణం పూర్తిగా పొడిగా మరియు ఎండగా మారుతుంది. ముఖ్యంగా నవంబర్ 8 నుండి రాత్రి మరియు ఉదయం వేళల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోవడం వల్ల చలితీవ్రత క్రమంగా పెరుగుతుంది. గాలిలో సగటు ఆర్ద్రత (Humidity) పగటిపూట 40%-50% గా పొడిగా ఉంటూ, రాత్రివేళల్లో గరిష్టంగా 75%-80% వరకు పెరుగుతుంది.

సగటు గరిష్ట ఉష్ణోగ్రత: 28-30°C

సగటు కనిష్ఠ ఉష్ణోగ్రత: 18-22°C

మొదటి రోజు (05/11/2026 08:30 గంటల నుండి 06/11/2026 08:30 గంటల వరకు)

తెలంగాణలో రాష్ట్రంలో కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది.

రెండవ రోజు (06/11/2026 08:30 గంటల నుండి 07/11/2026 08:30 గంటల వరకు)

తెలంగాణలో రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. మూడవ రోజు (07/11/2026 08:30 గంటల నుండి 08 /11/2026 08:30 గంటల వరకు)

తెలంగాణలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది.

నాలుగవ రోజు (08/11/2026 08:30 గంటల నుండి 09/11/2026 08:30 గంటల వరకు)

తెలంగాణ రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది.

ఐదవ రోజు (09/11/2026 08:30 గంటల నుండి 10/11/2026 08:30 గంటల వరకు)

తెలంగాణ రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది.

.

కూరగాయలు - ఈ వాతావరణ పరిస్థితులు కూరగాయల పంటల్లో రసం పీల్చే పురుగులు మరియు బూడిద తెగులు ఆశించడానికి అత్యంత అనుకూలంగా ఉంటాయి.

- రసం పీల్చే పురుగులు (Sucking Pests)

➢ నష్టం: రసం పీల్చే పురుగులు ఆకుల అడుగు భాగంలో చేరి రసాన్ని పీల్చడం వల్ల ఆకులు ముడుచుకుపోతాయి. తెల్లదోమల ద్వారా వైరస్ తెగుళ్లు వ్యాపిస్తాయి.

➢ నివారణ చర్యలు:

- ఎకరాకు 15–20 పసుపు మరియు నీలి రంగు జిగురు అట్టలను (Sticky Traps) పంట పాలంలో అమర్చాలి.
- పురుగుల ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు వేప నూనె 5 మి.లీ. లేదా ఎసిటామిప్రిడ్ (Acetamiprid) 20% SP 0.2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

- బూడిద తెగులు (Powdery Mildew)

➢ నష్టం: ఆకులపై తెల్లటి బూడిదలాంటి మచ్చలు ఏర్పడి, ఆకులు రాలిపోతాయి. ఈ తెగులు బెండ, వంగ మరియు తీగజాతి కూరగాయల్లో ఎక్కువగా కనిపిస్తుంది.

➢ నివారణ చర్యలు - తెగులు లక్షణాలు కనిపించగానే కరిగే గంధకం (Wettable Sulphur) 80% WP 3 గ్రాములు లేదా డైనోక్యాప్ (Dinocap) 48% EC 1 మి.లీ. లీటరు నీటికి కలిపి ఆకుల అడుగు భాగం పూర్తిగా తడిసేలా పిచికారీ చేయాలి.

- వేరు కుళ్లు / నారు కుళ్లు తెగులు (Root Rot / Damping-off)

➢ నష్టం: వర్షాలు పడిన నేలలో తేమ అధికంగా ఉండటం మరియు ఉదయం పూట చల్లని వాతావరణం ఉండటం వల్ల వేర్లు కుళ్లిపోతాయి. ఈ సమస్య టమోటా, మిరప నారుమడుల్లో ఎక్కువగా కనిపిస్తుంది.

➢ నివారణ చర్యలు:

- పాలంలో అదనపు నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- నారుమడుల్లో కాపర్ ఆక్సీక్లోరైడ్ (Copper Oxychloride) 50% WP 3 గ్రాములు లీటరు నీటికి కలిపి నేల పూర్తిగా తడిసేలా (Drenching) పోయాలి.

- మిరప

➢ రానున్న వర్షాల దృష్ట్యా మిరప పంటలో మొదలు కుళ్ళు తెగులు ఉధృతమయ్యే అవకాశం ఉంది. తెగులు తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో టెబుకోనజోల్ 25.9 EC @ 1 మి.లీ. + థయోఫినేట్ మిథైల్ 70 WP @ 2 గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి, మొక్కల మొదళ్ల చుట్టూ నేల బాగా తడిసేలా మందు ద్రావణాన్ని పోయాలి. 15 రోజుల తర్వాత జీవ శిలీంధ్రనాశిని ట్రైకోడెర్మా @ 5 గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి నేలలో వేయాలి.

➢ పాలంలో మురుగునీరు సక్రమంగా బయటకు వెళ్లేలా కాలువలు ఏర్పాటు చేసి, మొక్కల మొదళ్ల వద్ద నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

➢ పూర్తిగా ఎండిపోయిన మొక్కలను పీకి పాలం బయట నాశనం చేయాలి.

- ఈ సమయంలో నాటుకోతగిన కూరగాయలు
    - ఆలుగడ్డ - ధృవీకరించిన (Certified) ఆలుగడ్డ విత్తన దుంపలను బోదెలు మరియు కాలువల పద్ధతిలో నాటుకోవాలి. మొక్కల మధ్య దూరం 25 X 15 సెం.మీ.
    - ఉల్లిగడ్డ - రబీ (యాసంగి) ఉల్లిగడ్డ పంటకు నారుమడి (నర్సరీ) పెంపకం చేపట్టడానికి ఇది అనువైన సమయం.

పండ్లు

- మామిడి
    - చెట్టు బెరడులో ఉన్న తేనె మంచు పురుగులను నివారించడానికి ఎసిఫేట్ @ 1.5 గ్రా./లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ @ 0.3 మి.లీ./లీ. నీటికి కలిపి బెరడు తడిచేలా పిచికారీ చేయాలి.
    - పక్షి కన్ను తెగులు గమనిస్తే, కార్బెండజిమ్ మందును 1 గ్రా./లీ. లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా./లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
    - మామిడి చెట్లలో పూత వచ్చే దశ మరియు పిందె (కాయ) ఏర్పడే దశలో పొటాషియం నైట్రేట్ (13-0-45) @ 10 గ్రాములు/లీటరు నీటికి పిచికారీ చేయడం వల్ల పూత ఒకే సమయంలో సమానంగా రావడానికి, పూలు రాలిపోకుండా నిలవడానికి మరియు కాయల పరిమాణం పెరగడానికి సహాయపడుతుంది. లేదా మోనో పొటాషియం ఫాస్ఫేట్ (00-52-34) @ 10 గ్రాములు/లీటరు నీటికి పిచికారీ చేయవచ్చు.
    - పూత వచ్చే వరకు మామిడి తోటకు నీరు పెట్టడం ఆపివేయాలి.

- జామ
    - టీ దోమ మరియు గజ్జి తెగులు సంక్లిష్ట లక్షణాలు గమనించినట్లయితే, దెబ్బతిన్న పండ్లను, ఎండు పుల్లలను సేకరించి నాశనం చేయాలి. అలాగే, ల్యాంబ్డా సైహలోథ్రిన్ @ 0.5–1.0 మి.లీ./లీ. + (కార్బెండజిమ్ + మాంకోజెబ్) @ 2 గ్రా./లీ. చొప్పున కలిపి పిచికారీ చేయాలి.
    - జామ తోటలో పండు ఈగను పర్యవేక్షించడానికి, ఎకరాకు 8–10 చొప్పున మిథైల్ యూజినాల్ లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేయాలి.

- నిమ్మ మరియు బత్తాయి - తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, వర్షాలు తగ్గిన తరువాత నిమ్మ మరియు బత్తాయి తోటలలో ఆకుముడత (Leaf Miner) నివారణకు ముందస్తు చర్యగా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. మందును ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తోట పంటలు, సుగంధ ద్రవ్య పరియు ఔషధ మొక్కలు

- **పసుపు**
  - **నేలలోని తేమను బట్టి నీటి పారుదలని సర్దుబాటు చేయండి. బరువైన నేలలకు 2-3 సార్లు, తేలికపాటి నేలలకు 3-5 సార్లు నీటిని అందించవచ్చు.**
  - **కాండం తొలిచే పురుగుల వ్యాప్తిని నియంత్రించడానికి, క్లోరాంట్రానిలిప్రోల్ @ 0.5ml/లీటరు లేదా ఫ్లూబెండియామైడ్ @ 0.3ml/లీటరును ఆకులపై పిచికారీ చేయవచ్చు.**
  - **కలుపు మొక్కల తీవ్రతను బట్టి ఒకసారి చేతితో కలుపు తీయవచ్చు.**

- **అల్లం - వాస్తవ వర్షపాతం మరియు నేలలోని తేమను బట్టి నీటిపారుదలను సర్దుబాటు చేయండి. బరువైన నేలలకు 2-3 సార్లు, తేలికపాటి నేలలకు 3-5 సార్లు నీటిని అందించవచ్చు.**

- **ఆయిల్ పామ్**
  - **రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, వర్షం పడే రోజుల్లో నీటిపారుదలను నిలిపివేసి, నమోదైన వర్షపాతం మరియు నేలలోని తేమను బట్టి మాత్రమే నీటిని అందించాలి. ఆయిల్ పామ్ తోటల్లో నీరు నిల్వ ఉండకుండా సరైన కాలువలను ఏర్పాటు చేయాలి.**
  - **ప్రస్తుతం నెలకొని ఉన్న ఎల్ నినో పరిస్థితుల్లో, ప్రతి ఎకరానికి నెలకు 5 కిలోల యూరియా, 3 కిలోల DAP మరియు 10 కిలోల MOP ఎరువులను ఫర్టిగేషన్ ద్వారా అందించాలి.**

- **ఈ సమయంలో వాము, ధనియాలు వంటి సుగంధ ద్రవ్య విత్తనాలు విత్తుకోవచ్చు.**

పూలు

- **బంతిపూలు (Marigold) - పొలంలో నిలిచిన నీరు త్వరగా బయటకు వెళ్లేలా చూసుకోండి. గాలుల వల్ల పాడవైన ఆఫ్రికన్ బంతి రకాలు పడిపోకుండా ఉండటానికి వాటికి కర్రల సహాయంతో (Staking) ఆసరా కల్పించండి. వర్షం పడటానికి ముందే పూల కోత పూర్తి చేయండి. వర్షం పడిన వెంటనే పూలను కోయకండి. రవాణాలో పూలు కుళ్లిపోకుండా ఉండటానికి, మొక్కపైనే పూలు ఆరిన తర్వాత మాత్రమే కోయండి. వర్షాలు తగ్గి ఎండ వచ్చిన వెంటనే, అధిక తేమ వల్ల వచ్చే ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు (Alternaria Leaf Blight), మొగ్గ కుళ్ళు తెగులు (Flower Bud Rot) ఆశించే అవకాశం ఉన్నందున, నివారణకు లీటరు నీటికి 2.5 గ్రాముల మాంకోజెబ్ లేదా 1 మి.లీ. అజోక్సిస్ట్రోబిన్ కలిపి పిచికారీ చేయండి.**
- **గులాబీ (Rose) - తేమ మరియు తడిగా ఉండే ఆకుల వల్ల నల్లమచ్చ తెగులు (Black Spot), కొమ్మ కుళ్ళు తెగులు (Dieback) వ్యాపించే అవకాశం ఉంది. కాబట్టి, తోటలో రాలిన ఆకులను, ఇతర వ్యర్థాలను ఏరివేసి శిలీంధ్ర బీజాలను నాశనం చేయండి. నల్లమచ్చ తెగులు మరియు బూడిద తెగులు (Powdery Mildew) నివారణకు లీటరు నీటికి 0.7 గ్రాముల టెబుకోనజోల్ + ట్రైఫ్లోక్సిస్ట్రోబిన్ లేదా 1 గ్రాము కార్బెండజిమ్ కలిపి పిచికారీ చేయండి. పూల కుళ్ళు తెగులు నివారణకు లీటరు నీటికి 2 గ్రాముల క్లోరోథలోనిల్ 75% డబ్ల్యూ.పీ. కలిపి పిచికారీ చేయండి.**